# స్వచ్ఛ ఖిల్లాలు

**ఊళ్లోకి వెళ్లే రహదారులు అపరిశుభ్రం.. ఇళ్ల చుట్టూ మురుగు.. ఇదీ గ్రామీణ భారత ముఖచిత్రం. కానీ, అదంతా గతం.. మన పల్లెలు శుభ్రత దిశగా పయనిస్తున్నాయిప్పుడు. దేశవ్యాప్తంగా చేపట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమం పుణ్యమా అని పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నాయి. దీంతో పల్లెసీమలే దేశానికి పట్టుగొమ్మలన్నది నిజం చేస్తూ దేశమే స్వచ్ఛత దిశగా పయనిస్తోంది. ముఖ్యంగా గ్రామీణ భారతంలో వస్తున్న మార్పు మన జిల్లాలను స్వచ్ఛఖిల్లాలుగా చేస్తోంది. ఇందుకు ఉదాహరణ మహారాష్ట్రలోని సింధుదుర్గ్, హిమాచల్‌ప్రదేశ్‌లోని మండి జిల్లాలు.. స్వచ్ఛభారత్ ఫలితాలపై దేశవ్యాప్తంగా జరిపిన సర్వేలో ఇవి అగ్రస్థానాన్ని అందుకున్నాయి.**

## పరిశుభ్రతకు సింధుదుర్గం

ఏడాదికి సగటున 320 సెం.మీ. వర్షం కురిసే సింధుదుర్గ్ ఒకప్పుడు ఎక్కడ చూసినా మురుగు నీటితో కనిపించేది. కానీ, ఇప్పుడు ఆ జిల్లాలో మురుగునీరు నిల్వ అన్నది వెతికినా కనిపించదు. బహిరంగ మలవిసర్జన అన్న మాటే వినిపించదు.

మహారాష్ట్రలోని తీర ప్రాంత జిల్లా అయిన సింధుదుర్గ్‌లో 87.5 శాతం గ్రామాలే. అక్కడ పరిశుభ్రత ప్రయత్నాలు గతంలోనే మొదలయ్యాయి. మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన స్వచ్ఛ భారత్ కార్యక్రమంతో అవి మరింత ఊపందుకున్నాయి.

- 2000 సంవత్సరంలో మహారాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంత్ గాడ్గి బాబా గ్రామీణ పరిశుభ్రతా కార్యక్రమం(ఎస్‌జీబీవీఎస్‌సీ)తో శుభ్రతా యాత్ర మొదలైంది.
- 2000 నాటికి అక్కడ ప్రతి అయిదుగురిలో ఒకరికి మాత్రమే మరుగుదొడ్డి సౌకర్యం ఉండేది. ఎస్‌జీబీవీఎస్‌సీతో ఆ జిల్లాలో మరుగుదొడ్ల నిర్మాణం పెరిగింది.
- 2014లో స్వచ్ఛభారత్ కార్యక్రమం ప్రారంభమైన తరువాత ప్రజల్లో అవగాహన మరింతగా పెరిగింది. ఈ ఏడాది ఏప్రిల్‌కి జిల్లాలో 100 శాతం ఇళ్లకు మరుగుదొడ్లు నిర్మించారు.
- నిజానికి ఈ జిల్లా అంతా లాటరైట్ రకం రాతి నేల ఉంటుంది. 5 చదరపు అడుగుల గోతిని తవ్వాలన్నా కనీసం రూ.15 వేలు ఖర్చవుతుంది. అయినా ప్రజలు ఖర్చుకు వెరవక నిర్మించుకున్నారు.
- అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలూ కీలక పాత్ర పోషించాయి. అక్కడ విద్యార్థుల మనసుల్లో స్వచ్ఛత భావనలు నాటారు. వారు తమ తల్లిదండ్రులపై ఒత్తిడి తెచ్చి మరుగుదొడ్ల నిర్మాణం దిశగా వారిని నడిపించారు.
- పరిశుభ్రమైన పరిసరాల వల్ల లాభం.. మరుగుదొడ్ల అవసరం.. అవిలేకుంటే వచ్చే నష్టం, వ్యాధుల ముప్పు వంటివన్నీ వివరిస్తూ విద్యార్థులతో తల్లిదండ్రులకు లేఖలు రాయించిన పాఠశాలలున్నాయి.
- పాఠశాలల్లో స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞలు, గ్రామాల్లో నానానాని సభ(తాతయ్యబామ్మ సమావేశాలు) ఏర్పాటుచేసి పరిశుభ్రతపై అవగాహన పెంచారు.
- ఇలా అన్ని చేతులూ కలిసి సింధుదుర్గ్‌ను స్వచ్ఛదుర్గంగా మలిచాయి.



### ఘనత

- నిర్మల్ గ్రామీణ పురస్కారాలు పొందిన గ్రామాలు: 313
- పర్యావరణ సంతులిత్ సమృద్ధ్ గ్రామ యోజన పురస్కారాలు: 420
- తీరప్రాంత పరిశుభ్రత కార్యక్రమంలో లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి ఎక్కింది.
- ఈ జిల్లాలోని పలు గ్రామాలు ప్లాస్టిక్ రహితం.

## అక్కడంతా శుభ్రమండి

హిమాచల్ ప్రదేశ్‌లోని మండి జిల్లా సముద్ర మట్టానికి సుమారు 2500 అడుగుల ఎత్తున ఉంటుంది. మంచు, నిత్య వర్షాల కారణంగా ఒకప్పుడు ఎటుచూసినా మురుగే. చిత్తడిచిత్తడిగా ఉండడంతో వ్యాధుల ముప్పు తీవ్రంగా ఉండేది. అలాంటి మండి ఇప్పుడు వ్యర్థాలన్నవి కనిపించని శుభ్రమైన జిల్లాగా మారిపోయింది. ప్రపంచ బ్యాంకు సైతం మండి ప్రగతిని ప్రశంసిస్తూ..' 'మంచి పారిశుద్ధ్య విధానాలు, ప్రజాభాగస్వామ్యంతో అతి తక్కువ కాలంలో విజయం సాధించారు" అని పేర్కొంది.

- వార్డు, గ్రామస్థాయుల్లో స్వచ్ఛతా కమిటీలు వేసి పారిశుద్ధ్యాన్ని పర్యవేక్షించారు.
- ప్రతి వార్డులో స్వచ్ఛ మిత్ర, గ్రామంలో స్వచ్ఛ దూతలను నియమించారు. వారు పరిశుభ్రత ఆవశ్యకతపై అవగాహన కల్పించడం, మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రోత్సహించడం చేస్తారు.
- ఇంటింటి ప్రచారం, కళాజాతాలతో ప్రతి కుటుంబం మరుగుదొడ్డి నిర్మించుకునేలా చేశారు.



- పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించి వారు తల్లిదండ్రులను ప్రేరేపించేలా చేశారు.
- తక్కువ ఖర్చుతో మరుగుదొడ్లు నిర్మించుకునే విధానాలు అభివృద్ధి చేశారు.
- మారుమూల ప్రాంతాలవారు, పేదలు మరుగుదొడ్లు నిర్మించుకునేటప్పుడు మిగతా ప్రజలు శ్రమదానం చేసి వారికి ఖర్చు తగ్గిస్తారు.
- తాగునీటి కాలుష్యం లేకుండా నిత్యం పరీక్షలు నిర్వహించారు. తాగునీటి వనరులు కలుషితం కాకుండా చర్యలు చేపట్టారు.

### ఇవీ విజయాలు

- 2008 నాటికి మండి జిల్లాలో 28 శాతం ఇళ్లకే మరుగుదొడ్లు ఉండగా 2015 నాటికి 100 శాతం ఉన్నాయి.
- జిల్లావ్యాప్తంగా అన్ని విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలబాలికలకు వేర్వేరుగా మరుగుదొడ్లున్నాయి.
- 2014 నుంచి ఇప్పటివకు 4,490 మహిళా మండల్ గ్రామీణ స్వచ్ఛ అభియాన్‌లు ఏర్పాటయ్యాయి. అందులో సభ్యులు ఎప్పటికప్పుడు పాఠశాలల్లోని, సామాజిక మరుగుదొడ్లను శుభ్రం చేయడం, పాఠశాలల్లోని నీటి ట్యాంకులను శుభ్రం చేయడం చేస్తారు.
- మండల్ గ్రామీణ స్వచ్ఛ అభియాన్‌లలో 50 వేల మంది మహిళలు సేవలందిస్తున్నారు.
- 283 పంచాయతీలకు నిర్మల్ గ్రామ పురస్కారాలు.(హిమాచల్‌ప్రదేశ్‌లో ఇదే అత్యధికం)
- 73 గ్రామపంచాయతీలను వాల్మీకి సంపూర్ణ స్వచ్ఛతా పురస్కారాలు వరించాయి.
- బిల్, మెలిండా గేట్స్ ఫౌండేషన్.. స్పెయిన్‌కు చెందిన పాలిటెక్నికా వాలెన్సియా విశ్వవిద్యాలయం ప్రతినిధులు ఇక్కడ పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణను ప్రశంసించారు.

## సర్వే ఇలా..

- ఈ ఏడాది మేలో 'భారత నాణ్యత మండలి' (క్యూసీఐ) ఈ సర్వే ప్రారంభించింది. గ్రామీణ జిల్లాల్లో పరిశుభ్రతపై నిర్వహించిన మొట్టమొదటి సర్వే ఇది.
- దేశంలోని 53 మైదాన ప్రాంత, 22 కొండ ప్రాంత జిల్లాలు కలిపి మొత్తం 75 జిల్లాల్లో పరిశీలించారు.
- మైదాన జిల్లాలో మహారాష్ట్రలోని సింధుదుర్గ్, పర్వత ప్రాంతాల్లో హిమాచల్ ప్రదేశ్‌లోని మండీ ప్రథమ స్థానంలో నిలిచాయి.

### మిగతా విషయాల్లోనూ ముందంజే..

| జిల్లా | స్త్రీ పురుష నిష్పత్తి | అక్షరాస్యత శాతం |
|---|---|---|
| సింధుదుర్గ్ | 1036:1000 | 85.5 |
| మండి | 1012:1000 | 83.57 |

### మైదాన జిల్లాల్లో స్వచ్ఛత

| ర్యాంకు | జిల్లా | రాష్ట్రం | స్వచ్ఛతశాతం |
|---|---|---|---|
| 1 | సింధుదుర్గ్ | మహారాష్ట్ర | 96.8 |
| 2 | నదియా | పశ్చిమ్‌బంగ | 95 |
| 3 | సతారా | మహారాష్ట్ర | 92.9 |
| 4 | తూర్పుమిడ్నపూర్ | పశ్చిమ్‌బంగ | 92.6 |
| 5 | కొల్హాపూర్ | మహారాష్ట్ర | 91.6 |

### పర్వత ప్రాంత జిల్లాల్లో

| ర్యాంకు | జిల్లా | రాష్ట్రం | స్వచ్ఛతశాతం |
|---|---|---|---|
| 1 | మండి | హిమాచల్‌ప్రదేశ్ | 98.4 |
| 2 | పశ్చిమసిక్కిం | సిక్కిం | 96.4 |
| 3 | షిమ్లా | హిమాచల్‌ప్రదేశ్ | 94.1 |
| 4 | తూర్పుసిక్కిం | సిక్కిం | 93.7 |
| 5 | హమీర్‌పూర్ | హిమాచల్‌ప్రదేశ్ | 93.4 |

- ఈనాడు ప్రత్యేక విభాగం